Follow: @ANNTELUGU

REGISTERED NUMBER: APTEL/2014/58382

20-08-2025

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 257 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ఫొటో.. ఎంతో గొప్ప జ్ఞాపకం

### ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వేడుకల్లో సీఎస్ రామకృష్ణారావు, కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్, మహా:** ఒక్క ఫోటో వేల పదాలకు సమాధానం...కొన్ని శతాబ్ధాల పాటు మిగిలిపోయే జ్ఞాపకాలను అందిస్తుంది. ఒక్కో ఫోటో ఒక్కో భావాన్ని, ఆలోచనను వ్యక్తపరుస్తుంది. సెకండ్ల వ్యవధి లో తీసిన ఆ ఫోటోలు ఎన్నో అర్థాలను, ఎన్నో భావోద్వేగాలను కలిగిస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్లో సమాచార ప్రసారాల శాఖ ఏర్పాటు

మిగతా 2లో

టాప్ న్యూస్

## రాజకీయాల్లో రిజర్వేషన్లు అవసరం లేదు


- విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు సంచలన వ్యాఖ్యలు

03



## హైకోర్టుకు కేసీఆర్

- పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని పిటిషన్ లు
- వేరువేరుగా పిటిషన్ దాఖలు చేసిన కేసీఆర్, హరీశ్ రావు
- ఓ వైపు అసెంబ్లీలో రిపోర్ట్ ప్రవేశ పెడుతామని సీఎం రేవంత్ ప్రకటన




02

## సింగరేణి బంగారు అడుగు

- కర్నాటకలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్
- సింగరేణి చరిత్రలో తొలిసారిగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశం
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం వెల్లడి
- సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు

02



# జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతి

## ఇండియా కూటమి అభ్యర్థిగా అనూహ్య ఎంపిక

### తెలుగు ఉపరాష్ట్రపతికి పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలి - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిక్వెస్ట్

**న్యూఢిల్లీ, మహా :**

ఉప రాష్ట్రపతి ఎన్నికల బరిలో విపక్షాల ఇండియా కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. ఎవరూ ఊహించని విధంగా సుప్రీం కోర్టు మాజీ న్యాయ మూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పేరును మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం కావాలన్న అధికార పక్షం ప్రయత్నాలకు ప్రతిపక్షాలు గండికొట్టినట్టయింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన తెలుగు వ్యక్తిని ప్రతిపక్షాలు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే.

మిగతా 2లో

### ఇది పోటీ కాదు సైద్ధాంతిక యుద్ధం : ఖర్గే

ఇండియా కూటమి ఎంపిక అనంతరం మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ.. ఉప-రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాలు పోటీ చేస్తున్నాయని తెలిపారు. అయితే, రాజకీయ పోటీ కాదని, 'సైద్ధాంతిక యుద్ధమని వ్యాఖ్యానించారు. 'సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి మా అభ్యర్థి. ఆయన పేదల పక్షాన ఎలా నిలబడ్డారో, రాజ్యాంగాన్ని ఎలా రక్షించారో దేశ ప్రజలకు బాగా తెలుసు.. ప్రతిపక్ష పార్టీలు అన్నీ మా నిర్ణయానికి మద్దతిచ్చాయి.. అందుకే మేం ఉప-రాష్ట్రపతి ఎన్నికల బరిలో నిలుస్తున్నాం.. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా కూటమి కలిసికట్టుగా నిర్ణయం తీసుకుంది. ఏకాభిప్రాయంతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ఆమోదించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది ప్రజాస్వామ్యంలో గొప్ప క్షణం' అని ఖర్గే పేర్కొన్నారు.






## తెలంగాణ యూరియా పోరులో ప్రియాంక గాంధీ

### ఫలించిన కాంగ్రెస్ ఎంపీల పోరాటం.. ఎంపీల ఆందోళనకు దిగొచ్చిన కేంద్రం

తక్షణమే 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు

**హైదరాబాద్, మహా:**

తెలంగాణ ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యను పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై చేసిన ఒత్తిడి..కాంగ్రెస్ ఎంపీల పోరాటం ఫలించింది. పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఆందోళనలో మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ కూడా పాల్గొనడంతో కేంద్రం ఖంగుతింది. ఈ పోరు మరింత తీవ్రం కాకముందే.. చర్యలు చేపట్టాలని డిసైడైంది. తక్షణమే 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపునకు కేంద్రం హామీ ఇచ్చింది. గుజరాత్, కర్ణాటక నుంచి తక్షణమే తెలంగాణకు యూరియా తరలించాలని ఆదేశాలిచ్చింది. కేంద్రం స్పందన నేపథ్యంలో వారం రోజుల్లో తెలంగాణకు యూరియా వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. అంతకుముందు పార్లమెంటు ఆవరణలో రెండు రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన నిర్వహించిన సంగతి తెలిసిందే. కేంద్రం తెలంగాణకు 8 లక్షల టన్నుల యూరియా ఇస్తామని చెప్పి, కేవలం 5 లక్షల 32 వేల టన్నులు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు.

మిగతా 2లో

## ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రెడ్డి జాగృతి నిరసన
- సంఘీభావం ప్రకటించిన ఎంపీలు

02



## అధిష్టానం ఆదేశిస్తే కేసీఆర్‌ను కలుస్తా..

- తెలుగు ఉపరాష్ట్రపతికి పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిక్వెస్ట్
- రాజ్యాంగ పరిరక్షకుడనే.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపిక



02

## మార్వాడీల నోట్లు కావాలా.. ప్రజల ఓట్లు కావాలా

### స్థానికుల వ్యాపారాల రక్షణకు చట్టం తేవాలి

తెలంగాణేతరులు ఇక్కడ భూమి కొనడానికి వీల్లేదు

మార్వాడీ సమస్య పరిష్కారాలు సదస్సులో వక్తల డిమాండ్

గుజరాత్, రాజస్థాన్ వ్యాపారుల దుకాణాల్లో కొనుగోళ్లు చేయవద్దని తీర్మానం

**హైదరాబాద్, మహా :** మార్వాడీ కమ్యూనిటీ ప్రతినిధులు తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని కించపరిచేలా మాట్లాడటం తగదని ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. వాళ్ల పెద్ద పెట్టుబడుల ధాటికి తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా చిరు వ్యాపారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో



| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ | 81,644.39 |
| నిఫ్టీ | 24,980.65 |




| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,750 |
| 22 క్యారెట్ | 92,350 |
| సిల్వర్ (కేజీ) | 1,16,200 |

## వరద బాధితులను ఆదుకుంటాం

### పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందజేస్తాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ
- మానవతాదృక్పథంతో ఎకరాకు పదివేలు ఇవ్వాలని నిర్ణయించాం
- కూలిపోయిన విద్యుత్ స్థంబాలు పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం
- ఆదిలాబాద్ జిల్లాలో పర్యటన.. అధికారులతో కలిసి కడెం ప్రాజెక్ట్ పరిశీలన

**ఆదిలాబాద్, మహా:** గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి వివరాలను నీటిపారుదల శాఖ అధికారుల నుంచి తెలుసుకున్నారు.

మిగతా 2లో



## మండపాలకు ఉచిత విద్యుత్

- గణేష్ నవరాత్రులకు రూ. 30 కోట్లు కేటాయింపు
- సాఫీగా గణేష్ ఉత్సవాలు పూర్తవాలి
- మంత్రి పొన్నం కీలక ప్రకటన

03







# బీసీలు, ఓబీసీలకు న్యాయం ఎక్కడుంది

## సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ప్రశ్న

**హైదరాబాద్, మహా :** బీసీ, ఓబీసీలకు "న్యాయం చేశాం" అని డబ్బా కొట్టుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాదనలపై తెలంగాణ బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఎన్డీయే తరపున ఉన్న ఓబీసీ అభ్యర్థి రాధాకృష్ణకు వ్యతిరేకంగా, ఇండియా బ్లాక్ వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని ఆహ్వానించడం ద్వారా సిఎం ద్వంద్వ వైఖరి బహిర్గతమైందని పార్టీ వ్యాఖ్యానించింది. "ఇది కపటత్వం కాకపోతే మరి ఏం?" అని రాష్ట్ర బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్. వి. సుభాష్ ప్రశ్నించారు. కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థి బీసీలకు న్యాయం చేస్తారని చెప్పడం, ద్వార మరోసారి కాంగ్రెస్ బహిర్గతమైందన్నారుకేంద్రంలోనూ, తెలంగాణలోనూ, బీసీలు, ఓబీసీలను ఎప్పుడూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇది అలవాటే అని ఆయన ఎత్తిచూపారు. బీసీలు, ఓబీసీల సాధికారత కోసం ఎప్పుడూ కృషి చేసింది బీజేపీ మాత్రమేనని, ఒకప్పుడు మండల్ కమిషన్ నివేదికను అంగీకరించేందుకు కూడా వెనుకంజ వేసిన కాంగ్రెస్‌తో బీజేపీ తేడా ఇక్కడే స్పష్టమవుతుందని సుభాష్ గుర్తు చేశారు. "ప్రజలు అమాయకులు కారు. కాంగ్రెస్ గత చరిత్ర బాగా తెలుసు. బీసీలు, ఓబీసీలను ఎప్పుడూ పైకి లేపలేదు. ఇప్పుడు మాత్రం అబద్ధాలతో మోసగించేందుకు ప్రయత్నిస్తోంది," అని ఆయన అన్నారు.

ఎన్డీయే అభ్యర్థిపై నమ్మకం వ్యక్తం చేస్తూ, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన రాధాకృష్ణ ప్రతిభావంతమైన ప్రయాణాన్ని సుభాష్ ప్రస్తావించారు. "మా అభ్యర్థికి అర్హత ఉంది, విశ్వసనీయత ఉంది, సామాజిక వర్గాల మద్దతు ఉంది. ఇండియా బ్లాక్ తమ అభ్యర్థి విజయం సాధించలేదని ముందే తెలుసుకుని, రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జిని కేవలం బలి పశువుగా నిలబెట్టింది," అని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని బీసీలకు న్యాయం అని చెప్పడం తప్పుదారి పట్టించేలా ఉండటమే కాక, హాస్యాస్పదమని సుభాష్ ఎద్దేవా చేశారు. "తెలంగాణ ప్రజలు ఈ నాటకాన్ని బాగా గుర్తిస్తున్నారు. బీసీలు, ఓబీసీలకు న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ మరియు దాని మిత్రులకు లేదు. వారి కపటత్వం బహిరంగంగా బయటపడింది," అని సుభాష్ పేర్కొన్నారు.

# అధిష్ఠానం ఆదేశిస్తే కేసీఆర్‌ను కలుస్తా

- తెలుగు ఉపరాష్ట్రపతికి పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిక్వెస్ట్
- రాజ్యాంగ పరిరక్షకుడనే.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపిక



**హైదరాబాద్, మహా :** ఇండి కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం హర్షణీయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయనను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దకు తెలపాలని ఆయన పలు పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఎన్డీయే ప్రభుత్వంపై ఆయన పలు విమర్శలు గుప్పించారు. రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీఏ దుర్వినియోగం చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికలను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. 'రాజ్యాంగ రక్షణ కోసం పోరాడుతున్న ఇండి కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న ఎన్డీయే మరోవైపు' అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. పీవీ నరసింహారావు తర్వాత తెలుగువాడిని కూర్చోబెట్టే అవకాశం మనకు వచ్చిందన్నారు. ఇందుకోసం తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటి మీదకు రావాలని రేవంత్ కోరారు. టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, ఎంఐఎం సహా అన్ని పార్టీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలని చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల నేతలంతా కలిసి రావాలన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కాదని, ఇండి కూటమి అభ్యర్థి అని రేవంత్ రెడ్డి వివరించారు.

**తెలుగు నేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తిని ప్రదర్శించాలి**

ఆనాడు ప్రధాని పీవీ నరసింహారావుకు ఎన్టీఆర్ మద్దతు ఇచ్చారని, నంద్యాల ఉప ఎన్నికల్లో పీవీపై పోటీ పెట్టకుండా గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలుగువాడు కీలక పదవిలో ఉండాలనే భావనతోనే ఎన్టీఆర్ సహకరించారని అన్నారు. ఇప్పుడు మరోసారి తెలుగునేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వెనుకబడిన రైతు కుటుంబం నుంచి వచ్చారన్న సీఎం ఆయన న్యాయమూర్తిగా, లోకాయుక్తగా దేశానికి సేవలందించారని వివరించారు. ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువాడిపై ఉందని అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటిపైకి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ, ఎంఐఎం సహా అన్ని పార్టీలు సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలని రేవంత్ రెడ్డి అన్నారు.

**బీసీ బిల్లు ఆమోదం పొందాలంటే**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించామని రేవంత్ రెడ్డి వివరించారు. బీసీ బిల్లు ఆమోదం పొందాలంటే న్యాయకోవిదుడు కీలక పదవిలో ఉండాలన్నారు. రాధాకృష్ణన్ గెలిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదని అన్నారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను అని రేవంత్ రెడ్డి అన్నారు. తాము ఉత్తర, దక్షిణ భారత్ పేరిట విభజన రాజకీయాలు చేయట్లేదన్నారు. విభజన రాజకీయాల నుంచి దేశాన్ని రక్షించటం కోసం పోరాడుతున్నామన్నారు. ఇది తెలంగాణ వర్సెస్ తమిళనాడు అంశం కాదని ఆయన అభివర్ణించారు. కులగణన నివేదికపై తాము వేసిన స్వతంత్ర కమిటీ ఛైర్మన్ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అని రేవంత్ వివరించారు. సీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో న్యాయం జరగాలంటూ ఇటీవల నివేదిక ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. బీసీలకు న్యాయం కోరుతూ నివేదిక ఇచ్చారు కనుక భవిష్యత్‌లోనూ న్యాయం చేస్తారన్నారు. తెలుగు వాళ్లంతా ఒకటిగా ఉండి తెలుగువాడిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

**ఇప్పుడు కేసీఆర్ సమయం ఇస్తే కలుస్తా**

ప్రెస్‌మీట్ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇండి కూటమి నేతలు చెబితే కేసీఆర్‌ను కలుస్తానని వివరించారు. అయితే ఆయన అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో తెలియదని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు తానే స్వయంగా వెళ్లి కలిశానని గుర్తుచేశారు. ఇప్పుడు ఆయన సమయం ఇస్తే కలుస్తానని వివరించారు. పార్టీలకు అతీతంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆత్మప్రబోధానుసారం ఓట్లు వేయాలని ఆయన అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

# మార్వాడీల నోట్లు కావాలా.. ప్రజల ఓట్లు కావాలా

## స్థానికుల వ్యాపారాల రక్షణకు చట్టం తేవాలి

### తెలంగాణేతరులు ఇక్కడ భూమి కొనడానికి వీల్లేదు

### మార్వాడీ సమస్య పరిష్కారాలు సదస్సులో వక్తల డిమాండ్

### గుజరాత్, రాజస్థాన్ వ్యాపారుల దుకాణాల్లో కొనుగోళ్లు చేయవద్దని తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమంలో 'మా వ్యాపారాలు మాకే' అన్న నినాదం రాలేదని, ఆలస్యంగానైనా దీని మీద చర్చ మొదలవడం అవసరమని చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మార్వాడీ సమస్య పరిష్కారాలు' అంశంపై జరిగిన సదస్సులో హరగోపాల్ మాట్లాడారు.

తెలంగాణలోని స్థానిక చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారికి భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మార్వాడీలు తెలంగాణ పల్లెల్లోకి చొరబడి తమ ఉపాధిని ధ్వంసం చేస్తున్నారని ఆర్యవైశ్య, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. మార్వాడీల నోట్లు కావాలా? తెలంగాణ ప్రజల ఓట్లు కావాలా? రాజకీయ నాయకులు తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. మార్వాడీల వల్ల తెలంగాణ జీడీపీ పెరిగిందని బండి సంజయ్ అంటున్నారని, జీఎస్టీ ఎగవేసే వాళ్లతో జీడీపీ ఎలా పెరిగిందో చెప్పాలని ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి సముద్రాల శ్రీకాంత్ ప్రశ్నించారు. తెలంగాణ పండగల స్ఫూర్తిని మార్వాడీలు దెబ్బతీస్తున్నారని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ మండిపడ్డారు. ఆహార ఉత్పత్తులు, సరుకుల కల్తీ దందాలో 97 శాతం మార్వాడీలే ఉన్నారని ఆరోపించారు. ఆభరణాల తయారీలో మార్వాడీలు మోసపూరితంగా వ్యవహరిస్తారని తెలంగాణ విశ్వకర్మ ప్రతినిధి పరిపూర్ణాచారి ఆరోపించారు. ఐదు లక్షల కన్నా తక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో తెలంగాణేతర వ్యక్తుల వ్యాపారాలను అనుమతించకుండా ప్రభుత్వం నిబంధనలు తీసుకురావాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. మార్వాడీలు ఇచ్చే చందాల కోసమే రాజకీయ పార్టీల నేతలు వాళ్ల దారుణాలపై పల్లెత్తు మాట అనడం లేదని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి విమర్శించారు. కాగా, తెలంగాణలో స్థానికుల వ్యాపారాల రక్షణ కోసం, తెలంగాణేతరులు ఇక్కడ భూములు కొనకుండా ప్రభుత్వం చట్టాలు తేవాలని సదస్సులో తీర్మానించారు. రాష్ట్రంలో నెలకొల్పే ప్రతి సంస్థలో స్థానికులకే 80శాతం ఉద్యోగాలు ఇచ్చేలా నిబంధన తీసుకురావాలని డిమాండ్ చేశారు. గుజరాత్, రాజస్థాన్ వ్యాపారుల వద్ద కొనుగోళ్లు చేయవద్దని పిలుపునిచ్చారు..

# తెలంగాణ యూరియా పోరులో ప్రియాంక గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా సుమారు 3 లక్షల టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉందని, ఈ కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీల ఆందోళన**

తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం లోక్ సభలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 'యూరియా తగ్గింది.. తెలంగాణ రైతులకు సమస్య పెరిగింది' అనే ప్లకార్డు పట్టుకొని పోడియం వైపు దూసుకెళ్లారు. ఈ క్రమంలో ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కాసేపు సభ వాయిదా పడింది. అనంతరం ఎంపీలు పార్లమెంటు ఆవరణలో వయనాడ్ ఎంపీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో కలిసి ఆందోళన చేశారు. రాష్ట్రానికి తక్షణం యూరియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలోని బీఆర్ఎస్ ఎంపీలు, లోక్ సభలో ఉన్న బీజేపీ ఎంపీలు స్పందించపోవడం పై విస్మయం వ్యక్తమైంది. ఆందోళనలలో ఎంపీలు మల్లురవి, చామల కిరణ్, బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, రామసహాయం రఘురామిరెడ్డి, వంశీక్రిష్ణ, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రెడ్డి జాగృతి నిరసన

### సంఘీభావం ప్రకటించిన ఎంపీలు

**ఢిల్లీ, మహా:** ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్‌లో మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు కావలసిన ఆర్థిక వనరులు లేకపోవడం, తగిన వ్యవసాయ సబ్సిడీలు అందకపోవడం వల్ల తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందక ఇబ్బందులు పడుతున్నామని, కావున జాతీయ స్థాయిలో కమిషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవ రెడ్డి, రెడ్డి జాగృతి వ్యవస్థాపక సభ్యులు నీరుడు దయాకర్ రెడ్డి, హరిశ్వర్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోరెడ్డి కవిత, వర్కింగ్ ప్రెసిడెంట్ మేక సోమిరెడ్డి, అగ్రవర్ణ పేదల సమితి పెంజర్ల మహేందర్ రెడ్డి, అలాగే రెడ్డి జాగృతి వివిధ జిల్లా అధ్యక్షులు దేవుడి నర్సింహా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మెండు శ్రీకాంత్ రెడ్డి, స్వప్న రెడ్డి, దుర్గ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్, రఘురామిరెడ్డి తదితరులు ఈ నిరసనకు సంఘీభావం తెలిపారు.

# హైకోర్టుకు కేసీఆర్



- పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని పిటిషన్ లు
- వేరువేరుగా పిటిషన్ దాఖలు చేసిన కేసీఆర్, హరీశ్ రావు
- ఓ వైపు అసెంబ్లీలో రిపోర్ట్ ప్రవేశ పెడుతామని సీఎం రేవంత్ ప్రకటన

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక భయం పట్టుకుంది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్ హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణ అర్హత లేదని, కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్లు నేడు విచారించే అవకాశం ఉంది.

**వైఫల్యానికి బాధ్యత ఎవరిది?**

కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ మొదలుకొని నిర్మాణం, నాణ్యత, నిర్వహణ వరకు అనేక లోపాలు, అక్రమాలు జరిగినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతోంది. బ్యారేజీల నిర్మాణంలో లోపాలను ఎత్తిచూపడంతో పాటు ఏ వైఫల్యానికి ఎవరు బాధ్యులో సవివరంగా పేర్కొంది. గతంలో న్యాయ విచారణ కమిషన్ల నివేదికలపై ఏ రాష్ట్రంలో ఏం చేశారనే అంశాలపై నేటి కేబినెట్ భేటీ దృష్టి సారించే అవకాశం ఉంది. కమిషన్ ఇచ్చిన 700 పేజీల నివేదికలోని అంశాలను అధికారుల బృందం క్లుప్తంగా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. వ్యక్తిగత నిర్ణయాలు, రాజకీయ నాయకత్వ ప్రభావంతో పరిపాలన, ప్రణాళికపరమైన లోపాలతో పాటు సాంకేతిక అంశాలను విస్మరించారని కమిషన్ పేర్కొన్నట్లు అధికారుల కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది.

**అసెంబ్లీలో ప్రవేశపెడతామన్న సీఎం..**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై వేసిన జస్టిస్‌పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను త్వరలో తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెడతామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో వెల్లడించారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే రిపోర్టుపై తుది నిర్ణయం ఉంటుందని సీఎం తెలిపారు. శాసన సభలో చర్చ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలని నిర్ణయిస్తామన్న సీఎం జస్టిస్ ఘోష్ కమిషన్ సూచనల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ముందుకెళ్తుందని స్పష్టం చేశారు.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతి

(మొదటిపేజీ తరువాయి)

దీనికి బదులుగా ఇండియా కూటమి సైతం దక్షిణాది నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. దీంతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు ఇద్దరు దక్షిణాది నేతల మధ్య ఆసక్తికరంగా మారింది. ఈ ఎంపిక ద్వారా ప్రతిపక్షాలు కేవలం పోటీ ఇవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖుడిని బరిలోకి దించి వ్యూహాత్మకంగా వ్యవహరించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**కూటమి అభ్యర్థి నేపథ్యం ఇదే**

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిర్ణయించింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారికంగా ప్రకటించారు. తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి.. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాటు 2007 నుంచి 2011 వరకూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. అంతకు ముందు 2005 నుంచి 2007 వరకూ గువహటి హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ అనంతరం గోవా రాష్ట్రానికి తొలి లోకాయుక్త ఛైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఆగస్టు 21తో నామినేషన్ ముగియనుంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు చరిత్రాత్మక తీర్పులు, రాజ్యాంగ సూత్రాల నిబద్ధతకు మారు పేరుగా నిలిచారు. ఇండియా కూటమి న్యాయకోవిదుడిని వ్యూహాత్మకంగా ఎంపిక చేసింది. ఆయన అభ్యర్థిత్వం చట్టపరమైన ఆకర్షణతో పాటు పార్టీలకు అతీతంగా ఐక్యతకు చిహ్నంగా పరిగణిస్తున్నారు ఇది సంస్థాగత విశ్వసనీయత, సమ్మిళిత నాయకత్వంపై ఇండియా కూటమి ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది.

# ఫొటో.. ఎంతో గొప్ప జ్ఞాపకం

## ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### వేడుకల్లో సీఎస్ రామకృష్ణారావు, కమిషనర్ ప్రియాంక




(మొదటిపేజీ తరువాయి)

చేసిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక , ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి , సీఎం సీపిఆర్వో మల్సూరు తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించాను. చాలా ఫోటోలు ఆకట్టుకునేలా ఉన్నాయి. అందులో ఫోటోలు తీసిన విధానం, ఫోటోగ్రాఫర్లు పడిన కష్టం ఫోటోలలో స్పష్టంగా కనిపించింది. అద్భుతంగా తీసిన ఫోటోలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. మధుర జ్ఞాపకాలను నెమరేసుకోవడంలోనే కాదు క్లిష్టమైన సమస్యల పరిష్కారంలో కూడా ఫోటోలు ఎంతో ఉపయోగపడిన సందర్భాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హత్య కేసు దర్యాప్తులో ఒకే ఒక్క ఫోటో కీలక ఆధారంగా మారి నిందితులకు శిక్ష పడేలా చేసింది. అదీ ఫోటో కున్న విలువ అని మంత్రి అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన పోటోగ్రఫీ పోటీల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రాజీ యువ వికాసం, జనరల్ విభాగాల్లో గెలుపొందిన ఉత్తమ ఫోటోగ్రాఫర్లను సన్మానించి అవార్డులు అందజేశారు. ఫోటో గ్రాఫర్లను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం భవిష్యత్ లో కూడా కొనసాగిస్తుందన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంతో పాటు దేశంలోని ఫోటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వరద బాధితులను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే రూ.9 కోట్లతో మరమ్మతు పనులు పూర్తి చేశామని వెల్లడించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి తెలిపారు. భారీ వరదల కారణంగా పంట పొలాలు, నివాస గృహాలు, రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు.

**బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తాం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పంట నష్టపోతే రైతులకు ఎప్పుడూ నష్టపరిహారం ఇవ్వలేదని.. కానీ



కాంగ్రెస్ ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఎకరాకు పదివేలు ఇవ్వాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం సంభవించిందని, రోడ్లు, పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పలుచోట్ల విద్యుత్ స్థంబాలు కూలిపోయాయని, పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులు మంత్రి జూపల్లి ప్రకటనతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని వివరించారు. అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించామని మంత్రి తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ దండేవిట్టల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది రోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

## క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా:** దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించబోతుందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లోని తన నివాసంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు తొమ్మిది రోజుల పాటు ఉత్సాహభరితంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించబోతున్నామని ఆయన అన్నారు. ఆగస్టు 23వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం లోని స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణాలతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు.

**రోజుకొక కార్యక్రమం చొప్పున రూపకల్పన..**

ఈ ఉత్సవాలలో ఏడాది వయసున్న పిల్లల నుంచి 70 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్స్ వరకు పాల్గొనే విధంగా రోజుకొక కార్యక్రమం చొప్పున రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు. క్రీడల పట్ల అవగాహన, ఆలోచన, ఆచరణ అన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు యావత్ క్రీడా కుటుంబ సభ్యులు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. నూతన క్రీడా విధానం 2025 అమలులో భాగంగా జాతీయ క్రీడా దినోత్సవాలకు రూపకల్పన జరిగిందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఖేలో ఇండియా అధికారి డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల్లో రిజర్వేషన్లు అవసరం లేదు

## విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు సంచలన వ్యాఖ్యలు

**వికారాబాద్, మహా:** విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని, రాజకీయాల్లో అవసరం లేదని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు వ్యాఖ్యానించారు. వికారాబాద్ జిల్లా బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే, బీసీల జాబితాలో ముస్లింలను ఎందుకు చేరుస్తున్నారని ప్రశ్నించారు. బీసీలకు ఇప్పటికే బీసీబీ, బీసీఈ, ఈబీసీ కింద రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, రిజర్వేషన్లు విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలని.. రాజకీయాల్లో మాత్రం ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం యూరియా ఇవ్వడం లేదు అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, రైతుల ఇబ్బందులకు నిజమైన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని దుయ్యబట్టారు. మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదని, ఎరువుల దుకాణాల్లో యూరియా దొరక్కపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు.

**వికారాబాద్ జిల్లాను అనంతగిరిగా మారుస్తాం..**

రాబోయే రోజుల్లో ఏ శక్తి అడ్డొచ్చినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని దీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వికారాబాద్ జిల్లా పేరును అనంతగిరి జిల్లాగా మారుస్తామని, అనంతగిరి పర్యాటక కేంద్రంగా దక్షిణ ఊటీగా ప్రసిద్ధి చెందిందని, అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో వికారాబాద్‌లో బీజేపీ మూడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపించేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారని.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకే తీరుగా పాలనలో వైఫల్యం చెందాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ దళితబంధు, రైతుబంధు అంటూ మాయమాటలు చెప్పి, సరిగ్గా అమలు చేయక మోసం చేసిందని, అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద ప్రతి రైతుకి 15 వేలు ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చింది కానీ.. వాస్తవానికి రెండు విడతల్లో కేవలం రూ.6 వేలు మాత్రమే ఇచ్చారని, ఇది రైతులను మోసం చేయడమేనని అన్నారు.



# ఎఎన్ఎన్ నర్సయ్యతాతకు అభినందన

## బిగ్ బాస్ అగ్నిపరీక్షలో పాల్గొన్నందుకు శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహా:** తన ప్రతిభతో బిగ్ బాస్ అగ్నిపరీక్ష వరకు మెప్పించి వెళ్ళిన ఎఎన్ఎన్ జర్నలిస్ట్, యాంకర్, రచయిత, గాయకుడు నర్సయ్యతాత ను ఎఎన్ఎన్ ఛానల్, మహా పత్రిక ఉద్యోగులు అభినందించారు. ఎఎన్ఎన్ ఛానల్ లో ప్రసారమైన మార్నింగ్ న్యూస్ విత్ నర్సయ్యతాత, తగ్గేదెలే నర్సయ్యతాతతో రప్పారప్పా కార్యక్రమాలతో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నర్సయ్య తాత తన ఆటపాటలతో ప్రేక్షకులను రంజింపజేస్తున్నాడు. ఈ క్రమంలోనే బిగ్ బాస్ అగ్నిపరీక్షకు పిలుపురాగానే నర్సయ్య పాల్గొన్నాడు., ఇందుకు సంబంధించిన ప్రోమోను మా టీవీ విడుదల చేసింది. అగ్నిపరీక్షలో పాల్గొన్న నర్సయ్యతాతను ఎఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి అభినందించారు.



# మిస్ యూనివర్స్ ఇండియా 2025గా మణిక విశ్వకర్మ

**మహా:** ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్‌ను మణిక విశ్వకర్మ గెలుచుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా జరిగిన పోటీల్లో ఆమె కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో గత సంవత్సరం విజేత రియా సింఘా, మణికకు కిరీటాన్ని అలంకరించారు. రాబోయే నవంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరగనున్న 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున మణిక విశ్వకర్మ ప్రాతినిధ్యం వహించనున్నారు. మిస్ యూనివర్స్ ఇండియా 2025 జ్యూరీ మెంబర్, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ. "ఈ పోటీ చాలా టఫ్‌గా జరిగింది. మణిక విశ్వకర్మ విజేత కావడం ఆనందంగా ఉంది. ఆమె తప్పకుండా మిస్ యూనివర్స్ వేదికపై భారత్ గర్వపడేలా చేస్తుంది" అని తెలిపారు.

**ఇదీ మణిక బ్యాక్ గ్రౌండ్**

రాజస్థాన్‌లో పుట్టిన మణిక ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నారు. పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. క్లాసికల్ డ్యాన్సర్‌గా జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు. చిత్రలేఖనంలో కూడా మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. గతేడాది మిస్ యూనివర్స్ రాజస్థాన్ 2024 టైటిల్‌ను కూడా గెలుచుకున్నారు. అందాల పోటీల్లో మాత్రమే కాదు సమాజ సేవలోనూ మణిక విశ్వకర్మ ముందున్నారు. న్యూరోలాజికల్ సమస్యలతో బాధపడుతున్న వారికి సహాయం చేయడానికి న్యూరోనోవా అనే సంస్థను స్థాపించి సేవలు అందిస్తున్నారు. అయితే మిస్ యూనివర్స్ ఇండియా అయ్యాక మీడియాతో మాట్లాడారు.

# ఇంకేముంది..అంతా అయిపోయింది!

- ఒక ఫోటో వేయి పదాలకు సమానం
- హరీష్ రావుపై మంత్రి పొంగులేటి సెటైర్లు
- బీఆర్ఎస్ నేత హావభావాలకు మంత్రి క్యాప్షన్!



**హైదరాబాద్, మహా:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఒక ఫోటో వేయి పదాలకు సమానం అన్నట్లుగా మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సమాచార పౌరసంబంధాల శాఖ హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోటో ఎగ్జిబిషన్‌లో ఓ ఛాయాచిత్రం ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని విపరీతంగా ఆకర్షించింది. ఆఫోటో ఎవరిదోకాదు.. ప్రతిపక్షానికి చెందిన మాజీ మంత్రి హరీష్‌రావుది కావడం గమనార్హం!

**హరీష్‌రావులో నెలకొన్న నైరాశ్యాన్ని..**

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఓ సందర్భంలో వ్యక్తం చేసిన హావభావాలను హైదరాబాద్‌కు చెందిన కె. దుర్గా నరసింహారావు అనే ఫోటోగ్రాఫర్ ఒడిసిపట్టారు. సరిగ్గా అదే సమయంలో కెమెరాను క్లిక్ మనిపించి ఫోటోను ఎగ్జిబిషన్ పోటీలకు పంపించి ప్రత్యేక కన్సోలేషన్ బహుమతి పట్టేశారు. ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సమయంలో ఆ ఫోటో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మరీ ఎక్కువగా ఆకర్షించింది. అందుకే ఆయన తన ప్రసంగంలో ఈ ఫోటో గురించి ప్రస్తావిస్తూ ఆ ఫోటోకు తనదైన శైలిలో క్యాప్షన్ పెట్టారు. ఇంకేముంది ..అంతా అయిపోయింది అంటూ హరీష్‌రావులో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ ఫోటో ప్రపంచానికి పరిచయం చేసిందని పొంగులేటి వ్యాఖ్యానించారు.


# సింగరేణి బంగారు అడుగు

## కర్నాటకలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్

సింగరేణి చరిత్రలో తొలిసారిగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశం

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం వెల్లడి

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 19 (మహా):** సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చింది. కర్ణాటకలోని దేవ దుర్గ్ లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్ లైన్ వేలంలో 37.75 శాతం రాయల్టీ ని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్ 1 బిడ్డర్ గా నిలిచినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరాం మంగళవారం తెలిపారు. తద్వారా కీలక ఖనిజాన్వేషణలో సింగరేణి శుభారంభం చేసినట్లైందన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు.

**త్వరలోనే కర్ణాటకలో సింగరేణి అన్వేషణ**

కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ఈ ప్రాంతంలో సింగరేణి అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో త్వరలో పరిశోధన చేయనుంది. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్రం ఈ గనులను మైనింగ్ కోసం వేలంలో వేస్తుంది. ఆ గనులను సింగరేణి లేదా ఇతర సంస్థలు దక్కించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ గనులను మైనింగ్ కోసం దక్కించుకున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అన్వేషణ కోసం సుమారు 90 కోట్ల రూపాయలు వ్యయం అవుతుండగా.. అందులో రూ.20 కోట్లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ గా చెల్లిస్తుంది.

**రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అభినందనలు...**

బొగ్గు మైనింగ్ లో 136 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ తొలిసారిగా బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్సు వేలం ద్వారా దక్కించుకోవడం పట్ల రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తమ హర్షం ప్రకటించారు. సింగరేణి సంస్థ తనకున్న అపారమైన అన్వేషణ అనుభవం, బొగ్గు తవ్వకం అనుభవంతో కీలక ఖనిజాల అన్వేషణలోనూ దేశంలో ఒక అగ్రగామి సంస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణి అంతర్జాతీయ సంస్థగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సంస్థ సీఎండీ ఎన్.బలరాంకు ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేశారు.

**మూడు గనుల వేలంలో పాల్గొన్న సింగరేణి...**

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 13వ తేదీన మొత్తం 13 కీలక ఖనిజాల అన్వేషణ లైసెన్స్ ల కోసం వేలం ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో సింగరేణి సంస్థ పాలుపంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అన్వేషణకు అనువైన బ్లాక్లపై సింగరేణి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి అధ్యయనం చేయడం జరిగింది. అనంతరం మధ్య ప్రదేశ్ లోని పదార్ లోని ప్లాటినమ్ గ్రూప్ ఎలిమెంట్స్ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ లోని చంద్రగిరి వద్ద ఉన్న ఒంటిల్లులోని రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్, కర్ణాటకలోని బంగారం, రాగి బ్లాక్లు తమకు అనువైనవని గుర్తించడం జరిగింది. వీటి కోసం ఈ నెల 13, 14, 19 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ వేలం నిర్వహించింది. ఇందులో ఈ నెల 19వ తేదీన జరిగిన వేలంలో కర్ణాటకలోని దేవదుర్గ్లో ని బంగారం, రాగి బ్లాక్ల అన్వేషణ లైసెన్సు సింగరేణి దక్కించుకోవడం విశేషం.

# మండపాలకు ఉచిత విద్యుత్

## గణేష్ నవరాత్రులకు రూ. 30 కోట్లు కేటాయింపు

## సాఫీగా గణేష్ ఉత్సవాలు పూర్తవాలి.. మంత్రి పొన్నం కీలక ప్రకటన



**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలో సామూహిక వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమైంది. ఆగస్టు 27న మొదలయ్యే వినాయక చవితి పండుగ నుంచి సామూహిక గణేష్ నిమజ్జన కార్యక్రమ పూర్తయ్యేంత వరకు ఎక్కడా ఎలాంటి చిన్న ఘటన చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. అలానే వినాయక నిమజ్జనం కోసం ప్రభుత్వం 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం మొదలు.. నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలానే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నంతో పాటుగా జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, డీజీపీ జితేందర్, హెచ్ఎండీఏ కమిషనర్‌తో పాటుగా మూడు కమిషనరేట్ల అధికారులు, రంగారెడ్డి, హైదరాబాద్ , జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజల సాయంతో రాష్ట్రంలోనే కాక దేశంలోనే హైదరాబాద్ నగరంలో గణేష్ ఉత్సవాలు అద్భుతంగా జరుగుతాయని, ఈసారి గణేష్ ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలానే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే గణేష్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. ఈ అంశంలో పోయిన ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏంతో సాయం చేశారని ఈ సందర్భంగా మంత్రి పొన్నం గుర్తు చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర రాజధానిలో జరిగే అతిపెద్ద వేడుక గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఆర్ అండ్ బి, విద్యుత్, ఆరోగ్య, పోలీస్ విభాగాలు కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నగరంలో, రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, అలానే మండపాల వద్ద విద్యుత్ షాక్ వంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలానే నిమజ్జనం వేళ విగ్రహాలకు, వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.



# మార్కెట్ యార్డులో ఈ టెండర్ వేలం సోమవారానికి వాయిదా!

## మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఈ టెండర్ వేలం ప్రదర్శన, సాంకేతికత లోపం కారణంగా నిలిపివేయడం జరిగిందని చైర్మన్ గురునాథ్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో గత నెల రోజుల క్రితం నూతనంగా నిర్మించిన 17 దుకాణ సముదాయాలకు, జిల్లా అధికారుల సమక్షంలో ఈ టెండర్ ద్వారా బహిరంగ ప్రదర్శన చేయడం జరిగింది. అనంతరం ఈ యొక్క వేలంలో దుకాణం సొంతం చేసుకున్న వాళ్లు, తగిన రుసుము చెల్లించి అగ్రిమెంట్ చేసుకోవడం జరిగింది. కానీ వాటిలో మూడు దుకాణాలకు సంబంధించి వేలంలో దక్కించుకున్న వారు అనివార్య కారణాలవల్ల వాటిని రద్దు చేసుకోవడంతో, అధికారులు తిరిగి ఈ టెండర్ ద్వారా మరో అవకాశం ప్రజలకు కల్పించారు. ఈ యొక్క మూడు దుకాణాలకు ఆన్ లైన్ లో 12 దరఖాస్తులు రావడంతో మంగళవారం ఈ టెండర్ ద్వారా వారి పేర్లను ప్రకటించాల్సి ఉండగా, ఆన్ లైన్ లో సాంకేతిక లోపం కారణంగా సోమవారానికి వాయిదా వేయడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.








# నంబర్ గేమ్ కొత్త సమస్య..

## కమల్ హాసన్ థగ్‌లైఫ్ ఫెయిల్యూర్‌పై శృతిహాసన్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ రోల్ పోషించిన కూలీ సినిమాలో కీలక పాత్రలో నటించింది శృతిహాసన్. కూలీ బాక్సాఫీస్ వద్ద రికార్డులు,కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. అయితే ఈ భామ కూలీ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో తన తండ్రి కమల్ హాసన్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తున్నాయి. మణిరత్నం డైరెక్షన్‌లో కమల్ హాసన్ లీడ్ రోల్‌లో నటించిన థగ్‌లైఫ్ బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా బోల్తా కొట్టిన విషయం తెలిసిందే. అయితే ఇంటర్వ్యూలో థగ్‌లైఫ్ ఫెయిల్యూర్ మీ తండ్రిపై ప్రభావం చూపుతుందా.? అని అడిగిన ప్రశ్నకు శృతిహాసన్ తనదైన శైలిలో స్పందించింది. పదేళ్ల క్రితం నంబర్స్ (అంకెలు) కు సంబంధించిన చర్చ జరుగలేదు. తన సొంత డబ్బంతా సినిమాకే ఖర్చు పెట్టే మనస్తత్వం నుండి నాన్నగారు వచ్చారు. జనాలు అంచనాలు వేసే నంబర్ గేమ్స్ ఆయనను ప్రభావితం చేయవంది శృతిహాసన్. అంతేకాదు ఇది (నంబర్ గేమ్) నవతరం ధనవంతుల సమస్య అని నేను అనుకుంటున్నానని చెప్పుకొచ్చింది. కమల్ హాసన్ స్వభావం మీ మీద పడిందా అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అవును ఆయన స్వభావం (నీడ) నాపై ఎప్పుడూ ఉంటుంది. కానీ దానిని ఎదుర్కొంటానా..? లేదా అది అక్కడే ఉందని తెలుసుకుని నా డైరెక్షన్‌లో నేను నడుస్తున్నానా..? అనేది తెలియాలి. అప్పా (నాన్న) నాలోని వెలుగును కప్పి ఉంచే నీడగా కంటే.. నా జీవితంలో నీడను సృష్టించే సూర్యుడిలా ఉంటారంది శృతిహాసన్. మొత్తానికి శృతిహాసన్ తన తండ్రి గురించి గొప్పగా చెప్పకనే చెబుతూ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## భారీగా రోడ్డెక్కిన సినీ కార్మికులు..

# స్తంభించిన టాలీవుడ్

టాలీవుడ్ సినీ కార్మికులు 16వ రోజు కూడా సమ్మెలో పాల్గొన్నారు. తమ వేతనాలు పెంచాలంటూ ఇందిరానగర్‌లో పెద్దఎత్తున నిరసన తెలుపుతున్నారు. సినీ కార్మికుల ఐక్యవేదిక పేరుతో 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించిన కార్మికులు నిరసనకు పిలుపునిచ్చారు. ఇప్పటికే తమ వేతనాల పెంపు అంశాన్ని ఫెడరేషన్ నాయకులు చిరంజీవికి వివరించారు. ఈరోజు సాయింత్రం జరిగే ఫిలిం ఛాంబర్, కార్మికుల ఫెడరేషన్ చర్చలతో సమ్మె సమస్య ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 16వ రోజు సమ్మెతో టాలీవుడ్ ఇప్పటికే స్తంభించింది. షూటింగ్స్ లేక సగటు కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమావేశం అనంతరం నేడు మరోసారి ఫెడరేషన్ నాయకులతో పాటు నిర్మాతలు కూడా చిరంజీవిని కలవనున్నారు. నిర్మాతలు పెట్టిన మొత్తం నాలుగు కండిషన్స్‌లలో రెండు కండిషన్స్ దగ్గర మాత్రమే పేచీ ఏర్పడింది. కార్మికులకు ఫ్లెక్సిబుల్ కాల్షీట్స్.. ఆపై రెండో ఆదివారం, ప్రభుత్వ సెలవు రోజుల్లో మాత్రమే డబుల్ పేమెంట్ వంటి అంశాలను కార్మిక సంఘాలు వ్యతిరేఖిస్తున్నాయి.



# ‘లవ్ యూ రా’ కడుపుబ్బా నవ్వించేస్తుంది: హీరో చిన్ను

చిన్ను హీరోగా, గీతికా రతన్ హీరోయిన్‌గా సముద్రాల మంత్రయ్య బాబు, కొన్నిపాటి శ్రీనాథ్ ప్రజాపతి నిర్మాతలుగా రానున్న చిత్రం ‘లవ్ యూ రా’. ఈ మూవీకి ప్రసాద్ ఏలూరి దర్శకత్వం వహించారు. ఈ మూవీని సెప్టెంబర్ 5న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన ఈవెంట్‌ను సోమవారం (ఆగస్ట్ 18) నాడు నిర్వహించారు. ఈ క్రమంలో ‘ఏ మాయ చేశావే పిల్లా’, ‘వాట్సప్ బేబీ’, ‘యూత్ అబ్బా మేము’, ‘డైవాన్నే అడగాలా’ అనే పాటలను లాంచ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో..హీరో చిన్ను మాట్లాడుతూ .. ‘‘లవ్ యూ రా’ నాకు మొదటి చిత్రం. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఈ ప్రయాణంలో మా వెన్నంటే నిలిచిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ప్రసాద్ గారు నన్ను నమ్మి ఈ పాత్రను ఇచ్చారు. ‘లవ్ యూ రా’ ఆద్యంతం అందరినీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. గీతిక పాత్రకు ప్రాణం పోశారు. కృష్ణ సాయి కారెక్టర్ అందరినీ నవ్విస్తుంది. చంద్ర శేఖర్ గారి పాత్ర చాలా బాగా వచ్చింది. మా చిత్రంలో హారర్, కామెడీ, లవ్ ఇలా అన్ని అంశాలుంటాయి. ఈశ్వర్ గారు మాకు మంచి పాటలు ఇచ్చారు. సెప్టెంబర్ 5న మా చిత్రం రాబోతోంది. మీడియా సపోర్ట్ ఉంటేనే మాలాంటి వాళ్లు ఆడియెన్స్ వరకు చేరుకుంటాం. మా మూవీని అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ .. ‘‘లవ్ యూ రా’ చిత్రం సెప్టెంబర్ 5న రాబోతోంది. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. శ్రీనాథ్ గారు చెప్పినట్టుగా ఈ మూవీ వందకు రెండొందల శాతం సక్సెస్ అవుతుంది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్’ అని అన్నారు. హీరోయిన్ గీతిక మాట్లాడుతూ .. ‘‘లవ్ యూ రా’ టీం అంతా కలిసి ఎంతో సరదాగా షూటింగ్ చేశాం. సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. మా మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. సెప్టెంబర్ 5న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

# ప్రభాస్ గురించి తమిళ డిస్ట్రిబ్యూటర్ చెప్పిన నిజాలు



మిగతా హీరోలతో పోలిస్తే ప్రభాస్ పెద్దగా బయట కనిపించడు. తన సినిమాలేవో తాను చేసుకుంటూ ఉంటాడు. రిలీజ్ టైంలో, అది కూడా సమయం దొరికితేనే ప్రమోషన్లలో పాల్గొంటూ ఉంటాడు. ప్రభాస్ గురించి రూమర్స్ వస్తుంటాయి గానీ అవి నిజమో కాదో అనేది కూడా పెద్దగా తెలియదు. కానీ ఇప్పుడు ఓ తమిళ డిస్ట్రిబ్యూటర్ చెప్పిన విషయం మాత్రం వైరల్ అవుతోంది. ప్రభాస్.. తమకు రూ.50 కోట్ల తిరిగొచ్చాడని సదరు వ్యక్తి చెప్పుకొచ్చాడు. 'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేసిన సినిమాలు.. బాక్సాఫీస్ దగ్గర ఫెయిలవుతూ వచ్చాయి. 'సాహో', 'రాధేశ్యామ్', 'ఆదిపురుష్' చిత్రాలకు కలెక్షన్స్‌తో పాటు కొంతమేర నష్టాలు కూడా వచ్చాయి. ఇప్పుడు అదే విషయాన్ని ఓ తమిళ డిస్ట్రిబ్యూటర్ చెప్పుకొచ్చాడు. 'రాధేశ్యామ్' మూవీకిగానూ ప్రభాస్.. రూ.100 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకున్నాడని, కానీ సినిమా ఆడకపోయేసరికి రూ.50 కోట్లు నిర్మాతకు ఇచ్చాడని, ఈ మొత్తాన్ని నష్టపోయిన డిస్ట్రిబ్యూటర్లకు ఇవ్వమని కోరాడని వైరల్ అవుతున్న వీడియోలో సదరు డిస్ట్రిబ్యూటర్ చెప్పాడు. మరి ఇది ఎప్పటి వీడియోనో తెలియదు గానీ ఇప్పుడు వైరల్ అవుతోంది. ప్రభాస్ చేసిన పనిని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు. ఇప్పటి జనరేషన్‌లో చాలామంది హీరోలు.. పారితోషికం ఎక్కువగానే తీసుకుంటున్నారు గానీ ఫ్లాప్ అయిన నష్టాలొస్తే మాత్రం తిరిగి ఇచ్చేందుకు మాత్రం పెద్దగా ఆసక్తి చూపించరు. అలాంటి వాళ్లతో పోలిస్తే ప్రభాస్ డిఫరెంట్ అని చెప్పొచ్చు. ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. 'రాజాసాబ్' చివరిదశ పనుల్లో ఉంది. లెక్క ప్రకారం డిసెంబరు 5న థియేటర్లలోకి రావాలి. కానీ సంక్రాంతికి వాయిదా పడొచ్చనే రూమర్స్ వినిపిస్తున్నాయి. మరోవైపు 'ఫౌజీ'(వర్కింగ్ టైటిల్) షూటింగ్ సగానికి పైగా పూర్తయినట్లు తెలుస్తోంది. ఇది వచ్చే వేసవికి రిలీజ్ కావొచ్చని అంటున్నారు. వీటితోపాటు సెప్టెంబరు చివర్లో సందీప్ రెడ్డి వంగా తీయబోయే 'స్పిరిట్' షూటింగ్‌లోనూ ప్రభాస్ పాల్గొననున్నాడు.



# ఆ ఫోటోలు నాకు మంచి జ్ఞాపకాలు: శ్రీదేవి విజయ్‌కుమార్

‘‘సుందరకాండ’ మంచి వినోదాత్మక చిత్రం. కథ వినగానే షాక్ అయ్యాను. ఈ చిత్రంలో నేను చాలా మంచి బలమైనపాత్ర చేశాను. అందరూ థియేటర్స్‌కి వెళ్లిచూడొచ్చు’’ అని హీరోయిన్ శ్రీదేవి విజయ్‌కుమార్ తెలిపారు. నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందిన సినిమా ‘సుందరకాండ’. శ్రీదేవి విజయ్ కుమార్, వృతి వాఘాని హీరోయిన్లుగా నటించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీదేవి విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ–‘‘కొంత గ్యాప్ తర్వాత మళ్లీ వెండితెర పై నన్ను నేను చూసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నేను హీరోయిన్ గా చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకుని, ఓపాపకి జన్మనిచ్చాను. ఆ తర్వాత కొన్ని టీవీ ప్రోగ్రామ్స్ చేశాను. ఇప్పుడు నా కుమర్తె స్కూల్‌కు వెళుతోంది. సో.. నేను మళ్లీ సినిమాలతో బిజీ అవ్వాలనుకుంటున్నాను. ఈ సినిమాలో నేను స్కూల్ డ్రెస్‌లో కనిపించే సన్నివేశం ఉంది. ఈ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. డైట్ ఫాలో అయ్యాను. నా కుమార్తె, నేను స్కూల్ డ్రెస్‌లో ఉన్న ఫోటోలు నా దగ్గర ఉన్నాయి.. ఇవి నాకు మంచి జ్ఞాపకాలుగా ఉండిపోతాయి. ప్రభాస్‌గారి తొలి సినిమా ‘ఈశ్వర్’లో నేను హీరోయిన్ గా చేశాను.. తను పెద్ద స్టార్ అవుతాడని మేం అప్పుడే ఊహించాం.. మేం ఊహించిన దాని కన్నా పెద్ద స్టార్ అయ్యారు’’ అని చెప్పారు.



# డిఫరెంట్ పాత్రలో రష్మిక..

ప్రస్తుతం పాన్ ఇండియా హీరోయిన్లలో టాప్‌లో దూసుకుపోతున్న రష్మిక.. వరస సినిమాలతో బిజీగా ఉంది. ఈమె హిందీలో చేసిన లేటెస్ట్ మూవీ 'థామా'. 'స్త్రీ' యూనివర్స్‌లో భాగంగా వస్తున్న నాలుగో మూవీ ఇది. ఇంతకుముందు భేడియా, స్త్రీ, ముంజ్య చిత్రాలు వచ్చాయి. ప్రేక్షకుల్ని అలరించాయి. ఇప్పుడు 'థామా' పేరుతో ఈ మూవీలో రష్మిక, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటించారు. తాజాగా టీజర్‌ని 'వరల్డ్ ఆఫ్ థామా' పేరుతో రిలీజ్ చేశారు. గతంలో రష్మిక చెప్పినట్లు అతీంద్రియ శక్తులతో కూడిన రొమాంటిక్ సినిమాగా 'థామా' తీశారు. టీజర్‌లో రష్మిక.. ఇదివరకు ఎన్నడూ చూడనటువంటి పాత్రలో కనిపించింది. బోల్డ్‌గా కనిపిస్తూనే భయపెట్టింది కూడా. ఇందులో రష్మిక, దెయ్యంగానూ యాక్ట్ చేసినట్లు అనిపిస్తుంది. ఈ సినిమాకు ఆదిత్య సర్పోట్దర్ దర్శకుడు. హారర్ స్టోరీ అయినప్పటికీ.. ప్రేమకథని కూడా చూపించబోతున్నారు. ఈ దీపావళికి మూవీ థియేటర్లలోకి రానుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034